

రుణమాఫీ కోసం ఎదురుచూపు

ప్రభుత్వం రైతు రుణాలను మూడు విడతల్లో మాఫీ చేసింది. నాలుగో విడతపై స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

9లో▸

పకడ్బందీగా గ్రూప్-3 పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గ్రూప్ 3 ఇన్విజిలేటర్‌కు బయోమెట్రిక్‌పై రీజినల్ కోఆర్డినేటర్ లక్ష్మీ నరసింహం, బయోమెట్రిక్ ఆఫీసర్ మార్కండేయతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ ద్వారా పరీక్ష రాయబోయే అభ్యర్థిని గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. బయోమెట్రిక్ తీసుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
31.1 /18.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది. వేకువ జామున మంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

- ఎస్పీ శ్రీనివాస్‌రావ్



చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: గత నెల 14న గుండెపోటుతో మృతి చెందిన ఏఎస్సై గులాం మక్సూద్ కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావ్ అన్నారు. బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2,13,185 విలువగల పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నిరకాల ప్రతిఫలాలను త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పోలీసు కో ఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అంజన్న, జిల్లా పోలీసు కో ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి జాఫర్, హైమద్ భార్య, కుమారుడు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డోంగ్రి ప్రవీణ్ కుమార్

వాంకిడి: బాలల హక్కులు, బాల్య వివాహాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఖిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్లు పితాంబర్, సుకన్య, శకుంతల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ సాధన సర్వే 2024లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న జాతీయ స్థాయిలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరుగుతుందని, దానికి సంబంధించిన 3, 6, 9వ తరగతి విద్యార్థులకు అభ్యసన ఫలితాలు సాధించేలా బోధన చేయాలన్నారు. వారాంతపు పరీక్షలు, మాక్ టెస్టులు నిర్వహించాలన్నారు. అభ్యసన చార్టులు అందుబాటులో ఉంచాలని, నేటి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగం కార్యదర్శి వెంకటేశ్వర స్వామి, ఎస్‌వో శ్రీనివాస్, మండల రిసోర్స్ పర్సన్స్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

కౌటాల: ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డీఐఈవో కళ్యాణి అన్నారు. బుధవారం కౌటాల జూనియర్ కళాశాలను ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకేషనల్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, వృత్తి విద్య నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. వార్షిక పరీక్ష ఫీజు గడువు ఈ నెల వరకు ఉందని, విద్యార్థులు సకాలంలో చెల్లించాలన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాలా ఆక్రమణ తొలగింపు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలను బుధవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఇరిగేషన్ డీఈ దామోదర్, పోలీసు బందోబస్తు నడుమ నాలా ఆక్రమణ స్థలంలో మట్టిని జేసీబీతో తొలగించారు. ఇటీవల ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చెక్‌పోస్టు సమీపంలోని ఐదుగురు వ్యక్తులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు. మరో నలుగురు నోటీసులకు సమాధానం ఇచ్చి గడువు కోరినట్లు తహసీల్దార్ తెలిపారు.

రోగాలు కొని తెచ్చుకుంటున్నారు..!

- హోటళ్లలో కాలం చెల్లిన పదార్థాలు విక్రయం
- ఇష్టానుసారంగా షాపుల నిర్వహణ
- వాడిన నూనె పదే పదే వినియోగం
- జాడలేని అధికారుల తనిఖీలు



కౌటాల మండల కేంద్రానికి చెందిన బండి ప్రభాకర్‌గౌడ్ ఈ నెల 6న స్థానిక ఆర్టీసీ బేకరీలో క్రీమ్‌బన్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. బన్ తిన్న అతని భార్య శైలేజాగౌడ్ రాత్రి సమయంలో వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం క్రీమ్‌బన్ ప్యాకింగ్ కవర్‌ను పరిశీలించి చూడగా రెండు రోజుల ముందే గడువు ముగిసిందని తెలియడంతో ఈ నెల 7న సదరు బేకరీ వద్దకు వెళ్లి నిర్వాహకులను నిలదీశాడు. దురుసుగా సమాధానం ఇవ్వడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు.

కౌటాల: మనిషి జీవించాలంటే ఆహారం, నీళ్లు అతిముఖ్యం. తినేది కూడా కల్తీ లేని..శుభ్రమైన ఆహారం అయ్యుండాలి. ఇంట్లో వండుకోవడం కంటే బయట దొరికేది తినడానికి జనం ఇష్టపడుతున్న ప్రస్తుత రోజుల్లో అనారోగ్యం బారిన పడేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల పంజాబ్‌లో బర్త్‌డే కేక్ తిని పదేళ్ల బాలిక మృత్యువాత పడిన ఘనట విన్నాం. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో మోమోస్ తిని మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని హోటల్‌లో మండి బిర్యాని తిని ఫుడ్ పాయిజన్ కావడంతో 19 ఏళ్ల యువతి మృతి చెందిదిన సంఘటన చర్చనీయంశంగా మారింది. ఫుడ్ పాయిజన్ కేసులు జిల్లాలోనూ నమోదవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

వందలాది కేంద్రాలు..

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 15 రెస్టారెంట్లు, 90 ఆహార పదార్థాల విక్రయ దుకాణాలు ఉన్నాయి. కానీ అనధికారికంగా జిల్లాలోని 15 మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు ఉండగా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణ కేంద్రాల్లో అధిక మొత్తంలో ఉన్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అనుమతుల్లేని దుకాణాలు.. కల్తీ ఆహారం.. నామమాత్రంగా తనిఖీలు, అరకొరగా నమూనాల సేకరణ.. ఫలితాల వెల్లడిలో జాప్యం.. వెరసి ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేదు. జిల్లాలో వందల ఆహార విక్రయ కేంద్రాలున్నాయి. ఇందులో చాలా వాటికి అనుమతులు లేవు. పానీపూరీ, అల్పాహారం, చికెన్ పకోడి, ఫాస్ట్‌ఫుడ్ తోపుడు బండ్లకు సంబంధించి ఒక్కరికీ అనుమతి ఉండదు. ఇలా ప్రతీ పట్టణం, మండల కేంద్రాల్లో పుట్టగొడుగుల్లా అనుమతి లేని దుకాణాలు పుట్టుకొచ్చాయి. వారి ఇష్టం వచ్చినట్లు ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తుండటంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది.

అనారోగ్యానికి ఆహ్వానం

కాలం చెల్లిన తినుబండారాలు, స్వీట్లు, బేకరీ పదార్థాలు తిని చాలామంది అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. పాడైన ఆహార పదార్థాలు తిన్న ప్రజలు వాంతులు, విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమస్యలు, ఉదర సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. బయటి పదార్థాలు కొనే ముందు ప్రజలు ఆ పదార్థం తయారీ, గడువుతేదీ వివరాలు చూసుకోకపోవడం ఎక్కువ నష్టం కలిగిస్తోంది. బేకరీల్లో తయారు చేసే పదార్థాలు ఎన్ని రోజులు నిల్వ ఉంటాయో చెప్పలేని పరిస్థితి. ప్యాకేజ్డ్ వస్తువులు ఎప్పుడు తయారు చేశారు? కాలం ఎప్పుడు తీరుతుందనే వివరాలు కూడా చాలా వరకు ఉండటం లేదు. ఇలాంటివి కూడా సమస్యలకు కారణమవుతున్నాయి. ప్యాకేజీ యాక్ట్ ప్రకారం.. విక్రయించే ఆహార పదార్థాలన్నింటిపై తగిన వివరాలు ఉండాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరిగిన నూనె పదే పదే వాడి వీటిలో ఆహార పదార్థాలను వేయించడం వల్ల తిన్న వారికి జీర్ణాశయ సమస్యలతో పాటు కడుపునొప్పి, విరేచనాలు వేధిస్తున్నాయి. తాజాగా జిల్లాలో కూడా పలువురు బేకరీ, హోటళ్లలోని ఆహార పదార్థాలు తిని అనారోగ్యం బారిన పడ్డారు.

ఇటీవల జరిగిన సంఘటనలు

- కాగజ్‌నగర్ పెట్రోల్ పంపు ఏరియాలోని ఓ హోటల్‌లో గత నెల 27న మండీ చికెన్ తిన్న నలుగురు యువకులకు ఫుడ్ పాయిజన్ అయింది. రాత్రి సమయంలో కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో విరోచనాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పటి వరకు సదరు హోటల్ నిర్వాహకులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.
- కౌటాల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న బేకరీలో వారం రోజుల క్రితం కొంతమంది యువకులు సమోసా కొనుగోలు చేశారు. తింటుండగా దుర్వాసన రావడంతో బేకరీ నిర్వాహకులను నిలదీశారు. దురుసుగా సమాధానం చెప్పడంతో చేసేదేంలేక వెళ్లిపోయారు.
- కౌటాల మండలం యాపలగూడకు చెందిన ఓ వినియోగదారుడు ఇటీవల కౌటాల ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల బేకరీ నుంచి రూ.40 చెల్లించి బ్రెడ్‌ప్యాకెట్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. అతని భార్య నాలుగు బ్రెడ్ ముక్కలకు జామ్ చేసి ఇద్దరు పిల్లలకు ఇచ్చింది. మరుసటి రోజు ఉదయం ప్యాకెట్‌ను పరిశీలించగా.. బూజుపట్టి ఉన్నాయి. నిర్వాహకులను నిలదీయగా స్పందించలేదు.

నిబంధనలు గాలికి..

ఫుడ్ సేఫ్టీ చట్టం–2012 ప్రకారం బిర్యానీ, చికెన్‌లో రంగులు వాడకూడదు. నూనెను విడిగా విక్రయించరాదు. పట్టణ ప్రాంతాల్లో ప్రతీ 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ లక్ష మందికి ఒక తనిఖీ అధికారి ఉండాలి. అధికారి తాను పనిచేసే పరిధిలో నెలకు 12 చోట్ల తనిఖీలు చేపట్టాలి. కానీ వాటి జాడే లేదు. అప్పుడప్పుడు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులే దాడులు చేస్తున్నారు. జిల్లాలో గత నాలుగేళ్లలో ఒక్క తనిఖీ జరగకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం జిల్లాకు ఇద్దరు ఆహార తనిఖీ అధికారులు ఉండాల్సి ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వీరు ఆదిలాబాద్, మంచిర్యాలకు ఒకరు, నిర్మల్, కుమురం భీం జిల్లాలకు ఒకరు చొప్పున ఇద్దరే శాఖలో పని చేస్తున్నారు. పాలు, టీ, కూల్‌డ్రింక్స్, పసుపు, నెయ్యి, ఆహారం.. ఇలా అన్ని పదార్థాల నమూనాలు సేకరించాలి. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో.. విషయం బహిర్గతం అయితేనో కానీ చర్యలు కనిపించడం లేదు. అధికారులు అరకొరగా సేకరించిన నమూనాలను పరీక్షించి వెంటనే ఫలితాలు వెల్లడించే వ్యవస్థ జిల్లాలో లేకపోవడంతో పాటు ల్యాబ్ హైదరాబాద్‌లో ఉండడం.. నమునాలు సేకరించి కేసులు నమోదు చేయడం, అదనపు కలెక్టర్‌కు రిపోర్టు ఇవ్వడం, కోర్టుకు పంపడం వంటివి ఉండడంతో అధికారలు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులను వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

ఆహారం విషయంలో జాగ్రత్త

ఆహారం తినే విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త పాటించాలి. ఇంటివద్ద వండిన ఆహారం తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. చిన్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో బయటి తినుబండారాలు తినిపించొద్దు. నిల్వ ఉన్న ఆహారం తినవొద్దు. బయట కొనే పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అనారోగ్యం బారిన పడతారు.

– వినోద్‌కుమార్, వైద్యులు, ఆసిఫాబాద్

రైలు ప్రయాణం ఆలస్యం

- యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ
- నేటి నుంచి రెండు ట్రాక్‌లు అందుబాటులోకి..
- రెండ్రోజులు రైళ్ల రద్దు.. ప్రయాణికుల ఇబ్బందులు



నిర్మానుష్యంగా మంచిర్యాల రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రామగుండం, రాఘవపురం మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో గత రెండ్రోజులుగా రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే రంగంలోకి దిగిన రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు ఒక ట్రాక్ అందుబాటులోకి రాగా.. గురువారం వరకు మరొకటి అందుబాటులోకి రానుంది. మూడు ట్రాక్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే రెండ్రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రతీ రోజు బల్లార్షా నుంచి కాజీపేట, వరంగల్, కరీంనగర్ మధ్య నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వస్తు, ముడిసరుకుల రవాణా పెద్ద ఎత్తున జరుగుతుంది. సింగరేణి నుంచి బొగ్గు, సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్, ఇతర సరకు రవాణా జరుగుతుంది. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపేందుకు కీలక మార్గంగా ఉన్న ఈ రూట్‌మీదుగా కాజీపేట నుంచి కాగజ్‌నగర్ వరకు అనేక మందికి ప్రయాణానికి ఉపయుక్తంగా ఉంది. అనుకోని ఘటన జరగడంపై రైల్వే అధికారులు ప్రమాదం జరిగిన కారణంపై విచారణ చేపట్టారు. సమస్య పరిష్కారానికి గత రెండ్రోజులుగా రాత్రింబవళ్లు సాంకేతిక నిపుణులు, అధికారులు, సిబ్బంది ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు.

రైళ్లు రద్దు, మళ్లింపు

ట్రాక్ పనులు పూర్తయ్యే వరకు రైళ్లన్నీ రద్దు చేశారు. కొన్ని రైళ్లను పాక్షికంగా దారి మళ్లించారు. పెద్దపల్లి నుంచి కరీంనగర్ మీదుగా నిజామాబాద్ వరకు, మరికొన్నింటిని బల్లార్షా, నాగ్‌పూర్, మైత్రి, సేవాగ్రామ్ జంక్షన్ల నుంచి మళ్లించారు. సికింద్రాబాద్, విజయవాడ, నాగ్‌పూర్ సూపర్‌ఫాస్ట్‌లను ఆయా జంక్షన్ల గుండా మళ్లించారు. దీంతో ప్రయాణం గంటల కొద్దీ ఆలస్యంగా సాగుతోంది. ఈ ప్రాంతవాసులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు రద్దీగా ఉండే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్, దానాపూర్ వంటి కీలక రైళ్లు రద్దు కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు రైల్వేస్టేషన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. రాత్రి వేళ స్టేషన్‌లోనే చిన్న, పెద్ద అంతా అక్కడే ఉండిపోయారు. ప్రత్యామ్నాయం రోడ్డు మార్గం ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్నారు.

రూ.కోట్లలో నష్టం

మంచిర్యాల నుంచి సిర్పూర్ టౌన్ వరకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దీంతో రోజువారీగా ప్రయాణం చేసే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బంది ఏర్పడింది. ఇక గూడ్స్ రవాణాతోనూ సంస్థకు నిత్యం రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. ఈ క్రమంలో ఈ ఘటనతో ప్యాసింజర్, గూడ్స్ రవాణా నిలిచి రైల్వేకు రూ.కోట్లలోనే నష్టం వాటిల్లింది. గత ఏడాదిగా పలు కారణాలతో తరచూ రైళ్ల రద్దుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తాజాగా ఈ ఘటనతోనూ మళ్లీ ఇబ్బంది ఏర్పడింది.

పలు రైళ్ల రద్దు

సిర్పూర్(టి): పెద్దపల్లి సమీపంలో గూడ్స్ రైలు ప్రమాదం కారణంగా సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణించాల్సిన పలు రైళ్లు రద్దయినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 9 గంటల నుండి గురువారం మధ్యాహ్నం వరకు రామగిరి, సింగరేణి, పుష్పుల్ ప్యాసింజరు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మేకలవాడలో సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్, మేకలవాడలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే సిబ్బంది గడప గడపకూ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు సేకరించాలన్నారు. సర్వే చేపట్టే ముందు రోజు సంబంధిత ఇంటి యజమానులకు ముందస్తు సమాచారం అందించి అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే వివరా ల సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కాగా బుధవారం జిల్లాలో 12,439 గృహాలు సర్వే చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జన్కాపూర్, మే కలవాడలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని, అంతర్గత రహదా రులపై చెత్త లేకుండా చూడాలన్నారు. మేకల వాడలోని ఓ కిరాణా దుకాణం ముందున్న చెత్తను పరిశీ లించి సదరు దుకాణ యజమానికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావును ఆదేశించారు. కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రూప్–3 పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: గ్రూప్– 3 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న పరీ క్షకు జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో 4,471 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సి బ్బంది, ఫర్నిచర్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, వి ద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల ని ఆదేశించారు. అంతేకాకుండా గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, సహాయ సమన్వయకర్త రాజేశ్వర్, ఎంఈవో సుభాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

‘పీఎం జుగా’తో గిరిజనుల అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శంకర్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రధానమంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పథకం ప్రత్యేక అధికారి శంకర్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకంలో భాగంగా జిల్లాలోని 102 గిరిజన గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాగజ్‌నగర్ ఏటీడీవో ఖమర్ హుస్సేన్, జైనూర్ ఏటీడీవో శ్రీనివాస్, రాథోడ్ రవీందర్, కుడిమెత ఆనంద్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పాటల పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థినులకు రంగోళి, మెహందీ, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంతో పాటు ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

‘పని దినాలలో సర్వే చేపట్టాలి’



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: కుటుంబ సమగ్ర సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు పనిదినాలలో మాత్రమే నిర్వహించాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో బుధవారం డీఈవో యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సెలవు రోజులలో మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల, జిల్లాలో సమగ్ర శిక్షలో ఖాళీగా ఉన్న కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ , పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, వరలక్ష్మి, అనురాధ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల చారు.. పుచ్చిపోయిన కూరగాయలు

- అడిషనల్ కలెక్టర్ తనిఖీలో బయటపడిన లోపాలు
- దహెగాం కేజీబీవీలో విద్యార్థినుల గైర్హాజరుపై ఆగ్రహం



వంటలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

దహెగాం: నీళ్ల చారు.. పుచ్చి పోయిన కూరగాయలు, బోరు నీళ్లు తాగుతున్న విద్యార్థినులు, పాటించని మెనూ, విద్యార్థినుల గైర్హాజరు.. ఇవన్నీ అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ తనిఖీలో బయటపడిన లోపాలు. మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజరు శాతం పరిశీలించగా 312 మందికిగానూ 80 మంది గైర్హాజరు కావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇచ్చి విద్యార్థులను పాఠశాలకు వచ్చేలా చూడాలని ఎంపీడీవో రాజేందర్‌ను ఆదేశించారు. అనంతరం స్టోర్ రూం, కూరగాయలు నిల్వ చేసే గదులను పరిశీలించగా వంకాయలు పుచ్చిపోయి, తోటకూర వాడిపోయి ఉండడంతో మీ ఇళ్లలో ఇలాగే తింటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం బుధవారం అన్నం, పప్పు , కూరగాయ, రసం పెట్టాల్సి ఉండగా నీళ్ల చారు, క్యాలీఫ్లవర్ వండడంతో మెనూ ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. మెనూలో ఉన్నదే వండాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు బోరు నీటిని తాగుతుండడంతో వాటిని పరీక్షలకు పంపించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టక పోవడంతోనే గైర్హాజరు అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన..

మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు ఉన్నారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించారు.

క్లుప్తంగా

టిప్పర్ బోల్తా... వ్యక్తి మృతి


అల్తాఫ్(ఫైల్)

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బుధవారం టిప్పర్ బోల్తాపడింది. ఈ సంఘటనలో ఒకరు మృతిచెందినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. మండలంలోని తరోడా గ్రామానికి చెందిన అల్తాఫ్(42) మృతిచెందాడు. తన సొంత టిప్పర్‌తో మొరాన్ని తరోడా నుంచి బాసర వైపుకు తీసుకెళ్తుండగా అతివేగం, అజాగ్రత్త కారణంగా ముధోల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బోల్తాపడింది. ఈ ఘటనలో అల్తాఫ్ ఇరుక్క పోయి మృతి చెందాడు. సుమారు గంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మృతుడికి భార్య , ఇద్దరు కొడుకులు, కూతురున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన మహ్మద్ మోహిన్ (16) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అశోక్‌రోడ్‌కు చెందిన ఎండీ షరీఫ్, పర్వీన్ బేగం దంపతుల రెండో కుమారుడు ఎండీ మోహిన్ స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లోని బాత్‌రూమ్‌లో విద్యుత్ బల్బు పని చేయకపోవడంతో హోల్డర్‌ను సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి బైండోవర్

జన్నారం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. మండలంలోని పుట్టిగూడకు చెందిన లక్ష్మణ్ అక్రమంగా చెట్లు నరుకుతూ స్మగ్లింగ్ చేస్తున్నాడని, చింతగూడకు చెందిన చెందిన పానగంటి శ్రీనివాస్ తన ఇంట్లో కలప అక్రమంగా నిల్వ చేసుకున్నాడని తెలిపారు. వీరిద్దరిని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

కుస్తీ పోటీలకు విద్యార్థిని ఎంపిక


నైతికతో పాఠశాల సిబ్బంది

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 జాతీయస్థాయి కుస్తీ పోటీలకు దండేపల్లి మండలంలోని కన్నెపల్లి మదర్‌థెరిసా ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి.నైతిక ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్ జార్జ్, మేనేజర్ షైన్, కరస్పాండెంట్ లింటో, పీఈటీ దీపిక తెలిపారు. నారాయణపేట జిల్లా దన్వాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుచుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

బాలలు భళా..!

- వివిధ రంగాల్లో ప్రతిభ
- నేడు బాలల దినోత్సవం

మంచిర్యాలఅర్బన్: బాలలు చదువులో ఉన్నతంగా రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర వ్యాపకాలు ఎంతో అవసరం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విభిన్న రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఇన్‌స్పైర్, సకురా సైన్స్, నృత్య పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభతో ఔరా అనిపిస్తున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


ప్రధాని మోదీ టీ అమ్మిన హోటల్ వద్ద రైల్వేట్రాక్‌పై విష్ణువర్ధన్

ఇద్దరు విద్యార్థుల 'ప్రేరణ'


దర్శిని బజాజ్

మారుమూల ప్రాంతంలో చదివినా ప్రతిభకు కొదవలేదని నిరూపించారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన ప్రాంతాన్ని సందర్శించే అవకాశంతోపాటు స్వాతంత్ర్య దినోత్సవం రోజున నరేంద్రమోదీ జాతీయ జెండా ఎగురవేసే ఎర్రకోటకు వెళ్లే అరుదైన అవకాశాలను దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రేరణ కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో ఇద్దరు విద్యార్థులకు ఆ అవకాశం దక్కింది. కేంద్ర విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 10న వికసిత్ భారత్ ప్రేరణ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిల్లో జిల్లా పరిషత్ కిష్టాపూర్ పాఠశాల విద్యార్థి ఆర్.విష్ణువర్ధన్, చెన్నూరు చిన్నముల్ని పాఠశాలకు చెందిన దర్శిని బజాజ్ ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రంలోని ప్రధాని మోదీ నివసించిన ఇల్లు, రైల్వేస్టేషన్, టీ అమ్మిన హోటల్, చదువుకున్న పాఠశాల, పనిచేసి దుకాణంతోపాటు సూర్యభగవాన్ ఆలయం, చారిత్రక కట్టడాలు సందర్శించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యమయూరి

- నృత్య పోటీల్లో సహస్ర ప్రతిభ
- ఎన్నో బహుమతులు కైవసం


బహుమతి అందుకుంటున్న సహస్ర(ఫైల్)

జన్నారం: నృత్యం అంటే మక్కువ. తల్లి నృత్య కళాకారిణి కావడంతో కూతురూ కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ఎన్నో బహుమతులు సొంతం చేసుకుంది. జన్నారం మండలం పొనకల్‌కు చెందిన గాజుల నర్మద, రమేశ్ దంపతుల కూతురు సహస్ర(13) ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నర్మద కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ పొంది జన్నారంలో నటరాజ కళాక్షేత్రం నిర్వహిస్తూ నృత్యంలో శిక్షణ ఇస్తుండగా.. సహస్ర తల్లి వద్దే శిక్షణ పొందుతోంది. మంచిర్యాల జిల్లాతోపాటు కరీంనగర్, హైదరాబాద్, తిరుపతి, కాశీ వంటి ప్రదేశాల్లో జరిగిన కూచిపూడి, జానపద నృత్య పోటీల్లో ప్రతిభను చాటుకుంది.

- ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలో జరిగిన నృత్య పోటీల్లో కాంతార వేషధారణతో అక్కడి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది.
- హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ప్రత్యేక కూచిపూడి కేటగిరి నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది.
- తిరుపతిలో జరిగిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన నృత్య పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
- ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళోత్సవ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి సాధించింది.

కూచిపూడిలో డాక్టరేట్ పొందాలని ఉంది

ఒకవైపు చదువుకుంటూనే అమ్మ సహాయంతో నృత్య పోటీల్లో పాల్గొంటున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరిల్లో జరిగిన పోటీల్లో బహుమతులు సాధించాను. కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ పొందాలని నా కోరిక.

– సహస్ర, విద్యార్థిని


ఢిల్లీలో కాంతార నృత్య ప్రదర్శన(ఫైల్)

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు


పట్టుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సమీర్ ట్రేడర్స్‌లో కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 98 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి దినేశ్‌రెడ్డి తెలిపారు. ఇందులో విజిలెన్స్ ఏఎస్‌వో ప్రశాంత్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామారావు తదితరులు ఉన్నారు.

నగదు డిపాజిట్ చేస్తుండగా చోరీ

భైంసాటౌన్: బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.50 వేలు అపహరించిన ఘటన పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన సురేశ్ ఈనెల 11న నిర్మల్ రోడ్‌లోని ఎస్బీఐలో రూ.90 వేలు డిపాజిట్ చేసేందుకు రాగా, ఫాం నింపుతున్న క్రమంలో డబ్బు ఉన్న బ్యాగ్‌లోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కొద్ది సేపటికి సురేశ్ బ్యాగు చూడగా, అందులో రూ.50 వేలు కనిపించకపోవడంతో షాక్ అయ్యాడు బ్యాంక్ సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరిగిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామ సమీపంలో బుధవారం మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై మహేందర్ తెలిపారు. పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీకి చెందిన మహ్మద్‌ఎక్బాల్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాపరువైరు దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

జైపూర్: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల కాపర్ వైరు చోరీకి పాల్పడిన వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ వివరాలు వెల్లడించారు. సీసీసీ నస్పూర్‌కు చెందిన మోటం తిరుపతి, ఏవేల అంజి ఉదయం ఉల్లిగడ్డల వ్యాపారానికి పలు గ్రామాల్లో తిరుగుతూ పొలాల వద్ద వైర్లను గమనిస్తుంటారు. కాపర్‌వైర్ల చోరీకి పాల్పడి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిని అరెస్టు చేసి 20కిలోల కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసులను ఛేదించిన ఎస్సై శ్రీధర్, క్రైం పార్టీ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

ఖోఖో ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక


ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్ 14 జోనల్ స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. అండర్ 14 జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. శంకర్, సురేందర్, యాదవ్‌సాయ్, గణేశ్, రాంబాబు, శివచరణ్, హనుమంతు, శివసాయి, తేజ, అక్షిత్ కుమార్, వర్షిత్, వేణు, భీమేశ్, అనిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

పెన్‌గంగలో కోటి దీపోత్సవం

కార్తికమాసం సందర్భంగా భీంపూర్ మండలం వడూర్ శివారు పెన్‌గంగ తీరంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్లి(టి) రామాలయ వ్యవస్థాపకులు శివానంద భారతీస్వామి ఆధ్వర్యంలో భక్తులు ఉత్సవమూర్తులతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. నదికి హారతి ఇచ్చి దీపాలను అందులో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. మండలవాసులతో పాటు మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. – తాంసి


ఉత్సవమూర్తులతో తరలివస్తున్న భక్తులు

పాముకాటుకు మహిళ మృతి


బొడ్డు యశోద (ఫైల్)

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌కు చెందిన బొడ్డు యశోద(40) పాముకాటుకు మృతిచెందింది. ఎస్సై పి.రవీందర్ తెలిపిన వివరా ల ప్రకారం.. యశోద తన భర్త పోతన్నతో కలిసి తమ చేనులో బుధవారం పత్తి సేకరణకు వెళ్లింది. పాముకాటు వేయడంతో చికి త్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించా రు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన మావురపు జీవన్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జీవన్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరుతాయో లేదోనని మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహారాష్ట్రకు చెందిన ఒకరు..

మహారాష్ట్రలోని పటోర గ్రామానికి చెందిన మనోజ్ (35) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేయగా, పంట ఎదుగుదల లేకపోవడంతో దిగాలు చెందాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు.

బాలికపై అత్యాచార యత్నం

మంచిర్యాలక్రైం: బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ వ్యక్తిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన రాజేందర్ బాలిక(11)కు మంగళవారం రాత్రి మాయమాటలు చెప్పి హైటెక్ సిటీ సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లాడని పేర్కొన్నారు. అత్యాచారానికి యత్నించాడని బాధితురాలు కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా గోదావరి హారతి


గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

బాసర : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో గోదావరి హారతిని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నదీ తీరానగల సూర్యేశ్వర స్వామి ఆలయంలో వైదిక బృందం జ్వాలాతోరణ కార్యక్రమం ముందుగా నిర్వహించారు. అనంతరం అర్చకులు నదికి హారతి ఇచ్చారు. భక్తులు హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్వీస్‌బుక్‌లో ఎంట్రీకి లంచం

- బిల్ కలెక్టర్ వద్ద రూ.20 వేలు డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

నిర్మల్: తమ సొంత శాఖలో పనిచేసే బిల్ కలెక్టర్ వివరాలు సర్వీస్ బుక్‌లో నమోదు చేయడానికి కూడా రూ.20 వేలు లంచం అడిగిన ప్రభుద్ధుడు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన నిర్మల్‌లో బుధవారం జరిగింది. నిర్మల్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్ బిల్ కలెక్టర్ నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కరీంనగర్ డివిజన్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితుడు భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన భరత్ కారుణ్య నియామకం కింద నిర్మల్ మున్సిపల్‌లో బిల్‌కలెక్టర్‌గా నియామకమయ్యాడు. ఉద్యోగ వివరాలను సర్వీస్‌బుక్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంది. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ చూసే షాకీర్‌ఖాన్ తనకు రూ.20 వేలు ఇస్తేనే పనిచేస్తానని చెప్పాడు. రెండు నెలలుగా భరత్ బతిమాలుతున్నా పట్టించుకోలేదు. చివరకు రూ.15 వేలు ఇస్తేనే చేస్తానని చెప్పడంతో అంగీకరించాడు. దీంతో భరత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఉదయం బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా అవినీతి నిరోధ కశాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నస్పూర్: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సర్ఫేస్‌లో గల 16 డజిగ్నేషన్లలో ఉద్యోగాలపై ఇస్తున్న కౌన్సెలింగ్ బుధవారం కొనసాగింది. కౌన్సెలింగ్‌లో మొత్తం 85 మంది మహిళా బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం శ్రీధర్ రావు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, ఎస్‌ఈ కిరణ్‌కుమార్, అధికారులు కాంతారావు, మల్లయ్య, రవీందర్, చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏజెల్ల శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: రిటైర్డ్ పోలీస్ అధికారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ క్లబ్‌లో జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీంలో ఉన్న స్కీంలను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులకు హెల్త్ స్కీంకు సంబంధించి రూ.800 అలవెన్స్ ఇస్తారని, దానిని రూ. వెయ్యికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 మార్చి తరువాత నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎల్‌ఎం టాక్స్‌మెంట్, గ్రాట్యుటీ కమిషన్‌కు సంబంధించిన నగదు రాక అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ విడుదల చేయాలని, ఆదాయ పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలో కార్యవర్గాల ఏర్పాటు అనంతరం రాష్ట్ర సమావేశం నిర్వహించి డిమాండ్లను ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ ఎం.రాజమల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రాజమౌళిగౌడ్, ఉపాధ్యక్షుడు టి.వేణుగోపాలస్వామి, సంయుక్త కార్యదర్శి ఎండీ.తాహెరుద్దీన్, మంచిర్యాల గౌరవ అధ్యక్షుడు జే.నారాయణరావు, ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తుపాకీతో బెదిరించి చోరీకి యత్నం


సీసీపుటేజీలో నమోదైన దొంగల దృశ్యం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని అడ్డకూరి రమేశ్ అనే వ్యాపారి ఇంటి వద్ద తుపాకీతో బెదిరించి దొంగతనానికి ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రమేశ్‌కు చెందిన వైన్స్ దుకాణంలో పనిచేసే లక్ష్మణ్‌గౌడ్ రోజూ దుకాణం బంద్ చేసిన తర్వాత డబ్బులను తీసుకొచ్చి రమేశ్‌కు అప్పగించేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి దుకాణం మూసేసిన తర్వాత లక్ష్మణ్‌గౌడ్ డబ్బులు తీసుకుని బైక్‌పై వచ్చి రమేశ్ ఇంటిముందు ఆగాడు. అప్పటికే కాచుకొని ముసుగులతో ఉన్న ఇద్దరు దొంగలు లక్ష్మణ్‌ను తుపాకీతో బెదిరించగా తప్పించుకుని ఇంటిలోపలికి పరిగెత్తాడు. వెంటనే దొంగలు బైక్ కీ తీసుకొని స్కూటీపై పారిపోయారు. సీసీపుటేజీ ఆధారంగా పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సతీశ్ దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

విషమంగానే శైలజ ఆరోగ్యం

వాంకిడి: హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. శైలజతో పాటు నిమ్స్‌లో చికిత్స పొందిన జ్యోతి, మహాలక్ష్మి పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం వారిని డిశ్చార్జ్ చేసినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. అయితే శైలజ ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను ఫోన్ చేసి తెలుసుకోగా ఆరోగ్యం మెరుగుపడలేదని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కాగా మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.